# ఆనంద ధుని

## డా. మాదిరాజు రంగారావు

[అరవిందుల—మహాకావ్యం సావిత్రి చదివిన తరువాత పొందిన మానసికమైన అనుభూతిని చిత్రించే కృతి.]

**1**

ఈ క్షణం మేల్కొంది
కాంతి బిందువై,
పాకింది రేఖలుగా
కరిగిస్తూ తమో రాశి.

కల్పన వాస్తవమైంది.
స్థావరం జంగమమైంది.
శూన్యం సంభృతమైంది.
కాలం తెలివి పొందింది.

ఇంతవరకూ అననుభూతంగా
ఉండిన మనోజ్ఞ రూపం
హిరణ్య గర్భం నుండి
ఓంకారం వలె
ఆవిర్భూతమైంది ఈ క్షణం
ఆత్మకు ఇస్తూ ఆనందాకృతి.

లౌకిక వనమంతా ఇపుడు
చివురించింది క్రొత్త తెలివి
సూర్యకిరణ పంక్తుల్లో
ప్రకాశమాన కళ వలె.

అలలో కన్పించే కదలికతో
కలలో దాగిన వాస్తవంతో
కన్పిస్తోంది—చంద్రకళ
ఏ శిరోఽలంకారమో ?

ఇది మాయ కాదు
మృగతృష్ణ కాదు,
విస్పష్టమైన అనుభవ దర్పణం
ఆత్మను బింబించే క్షణం.

చీకటి కలిసిపోతూంది
వెలుగులో తహతహతో
రూపు మాపుకొనే ఆశలో
అగ్నిని గుర్తిస్తూ తెలివితో.

**2**

క్షణాలు గడుస్తున్నాయి
రెక్కలు సాగి నింగిలో
కదలిపోయే మబ్బుల వలె.

జీవిత చక్రనేమి క్రమణ వేగానికి
ఎగసి క్రమ్మిన దుమ్ము అణగి
వెలుగుతూంది ఆత్మతేజం.

నిద్రా గుహనుండి
బయటికి వచ్చిన మనస్సు
బ్రతుకుకై అన్వేషణలో
పొందిన అశాంతి ప్రళయం,
చెరగిపోతూంది
ఎక్కడికక్కడ ఈ క్షణం.

నిప్పునుండి వెలుగు
వేరయి పోయే లోపల
దిక్కులు వెడల్పు చేయజూచే,
ధూమ వదనం వివర్ణమౌతూంది.

అహంకారం దూకుతూంది సముద్రంలో.
మహాభయం కలుస్తూంది గాలిలో.

మొక్కకు కావాలి
వెలుగూ, నీరూ—
మెలకువకు కావాలి
అనుభవం, వివేకం,

జీవితంలో కన్పించే
సురాసుర శక్తుల సంఘర్షణ
కావాలి ప్రాణభయంనుండి
జీవిత సత్యానికి మార్గం
దైవాభిముఖంగా సాగే పథంలోని
మానసిక సుందర శిల్పాలే దేవతలు!

ఇక్కడ ఎక్కడ ఉంది
వివిధ వస్తు విభేదం!

4/12/26, 5:56 PM IMG_3988.HEIC



ఉంది ఒక్కటే ఇక్కడ
ఆత్మ కళా వైవిధ్యం!

మౌనానికీ ధ్యానానికీ
వ్యాఖ్యానంగా ఉంది స్థితి.
రాశికమూ వాస్తవమూ
దాటుతున్నాయి మనోదశలు.

ఈ స్థితి ఏలా ఉందంటే
బరువు మోసుక పోయేవాడు
మధ్యలో దింపుకొని కాసేపు
విశ్రాంతి పొందుతున్నట్లుంది.

ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసంలో
జలధి లహరీ స్పందనంలో,
ప్రతి క్రియా రూపంలో
మేఘ గమన విలసనంలో,
ఈ శరీరం మానవునికి
పరమ యథార్థ రూపమై;
ఈ జన్మ ఇక్కడ కాదు
ఎవరికీ దుఃఖ భాయిష్ఠం.

అవాలి
ఆనంద వలయం
చేరే నిశ్రేణిక,
కావాలి
శుభవాసనా రూపం
పొందే అవకాశం.

3

ప్రకాశమాన ఆలోచనకూ
క్రియాత్మక ప్రవర్తనకూ
మధ్య
సూక్ష్మలోకం మంచుతెరవలె.

మృత్యు నిరంకుశత్వంనుండి
స్వాతంత్ర్యాన్ని పొందింది మనస్సు.
రహస్యం ప్రత్యక్షమైంది ఆకాశం
ఆవహించి శబ్దధుని,
కొండలనుండి జలపాతంవలె
అడవిలో వాయు భ్రమణం వలె.

మనస్సు పొందుతూంది
మందర ప్రవాహ రూపం,

మెరుపుతో వానవచ్చే
వర్షా మృదు భావనతో.

ఎదలో సాగిన లత
పూచింది కళ్లలో పూలు.
విప్పారాయి ఆశలు
పసిడి మొగలి పట్టలవలె.
తల ఎత్తిన ఆశ్చర్యంతో
పిలిచింది స్వర్గం దిగి క్రిందికి.

వెలుగు పొరలు చుట్టుకున్న
గాలి అంచుల్లో కదలుతూ
మనస్సు పొందుతూంది
అవిచ్ఛిన్న సంస్కార గంధం.

భూమిని ఆకాశం వలె
ఆకాశాన్ని కాంతి వలె
ప్రకృతిని అనంతశక్తి
స్పృశిస్తూంది పరుసవేదిగా,
ఆదర్శానికీ వాస్తవికతకూ
ఆత్మకూ శరీరానికీ
ఇంతవరకూ ఎరుగని
సూక్ష్మబంధం చేకూరుస్తూ,

జీవిత గమన రీతిలో
హృదయ స్పందన లయతో
శబ్దాలు తొలిచి చేసిన
రమణీయ రసాకృతి
దాటుతూంది మనోవలయం
మంత్రాక్షర ముఖంతో.

నిశ్శబ్ద వలయం వెనుకనుండి
వినిపిస్తూంది స్వర తరంగం.
స్వర తరంగ వలయాల్లో
బింబిస్తూంది సంగీత చిత్రం.

స్వర్లోకం కదలిపోతూంది
స్పృశిస్తూ శారీరక జగత్తును,
జవనాంతర సౌహార్దంతో
వెలుగుతూంది హృదయాకాశం.

మహాశక్తి సౌందర్యైకకాంతి
ప్రవహిస్తూంది నాలోకి.
పరమానందకుసుమ పరిమళం
ప్రసరిస్తూంది నానుండి.



https://drive.google.com/drive/folders/15v8Q3Yg49OqTTtEbaw9K_ozSbUDpXYmq 1/1